క్లుప్తంగా

నాణ్యతగా రహదారుల నిర్మాణం

అమరచింత: మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో నిర్మించిన సీసీ రహదారిలో నాణ్యత ప్రకారం మెటీరియల్ వినియోగించి రహదారిని నిర్మించినట్లు పీఆర్ ఏఈ నరేష్ తెలిపారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.7 లక్షలతో 155 మీటర్ల మేరకు సీసీ రహదారి మంజూరైందన్నారు. వీటిని త్వరితంగా పూర్తి చేసి ప్రతి నిత్యం క్యూరింగ్ జరిగేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా మండలంలోని ఆయా గ్రామాలకు మంజూరైన సీసీ రహదారులను వేగంగా నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

జూనియర్ లెక్చరర్‌గా దేవేందర్‌నాయక్ ఎంపిక



పాన్‌గల్: మండలంలోని దావాజిపల్లితండాకు చెందిన ముడావత్ లక్ష్మి, ఠాకూర్‌నాయక్‌ల కుమారుడు దేవేందర్‌నాయక్ సివిక్స్ జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాడు. దేవేందర్ ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం లభించడంపై కుటుంబ సభ్యులు, తండావాసులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

కొత్తకోట రూరల్: మండలంలోని రామకృష్ణాపురం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ చిన్నారులు దాదాపు 100 మంది విద్యార్థులకు రాష్ట్ర గ్రామీణ సంక్షేత్ర మిషన్ వారి ఆధ్వర్యంలో బ్యాగులు పంపిణీ చేసినట్లు సీడీసీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, లోకారెడ్డి, శివరాములు యాదవ్, బి.రాములునాయుడు, జి.నాగరాజుయాదవ్, నరసింహాసాగర్, ఎల్లస్వామి, వెంకటన్న ఎస్.వెంకటేష్, మాసన్న, రవికుమార్ సాగర్, శ్రీను సాగర్ తదితరులు ఉన్నారు.

ప్యాడ్లు, పెన్నులు అందజేత

మండలంలోని రామనంతాపురం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు టీజీ మహేష్ పదో తరగతి పరీక్షలు రాసే పామాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో 20మంది, అప్పరాల జెడ్పీహెచ్‌ఎస్‌లో 25మంది, మిరాసిపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో 11మంది విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేశారు.

ఖిల్లాఘనపురంలో కంటి అద్దాలు..

ఖిల్లాఘనపురం: మండలంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం కంటి అద్దాలు పంపిణీ చేశారు. లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే వారు మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి.. సమస్య ఉన్నవారిని గుర్తించి వారికి అద్దాలు అందించినట్లు లక్ష్మారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే నిర్వాహకులు భానుప్రకాష్, సురేందర్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది, ఎంఆర్‌సి సిబ్బంది అర్జున్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

చిన్నంబావి: ఉపాధి పనికి వచ్చే కూలీలలకు పని ప్రదేశంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు కోరారు. ఆయన మండలంలోని బెక్కం గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పని జరిగే దేశంలో గ్రీన్ నెట్ టెంట్లను ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

కవయిత్రికి ఘన నివాళి

వనపర్తిటౌన్: రచయిత్రి మొల్ల రచనలు సమాజానికి ఆదర్శంగా ఉంటాయని మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. ఈ మేరకు గురువారం మొల్ల 585వ జయంతి పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిరాజాచారి, నరసింహశర్మ, నాగరాజు, దేవన్న ఉన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

పాన్‌గల్: దాడి చేసిన ఘటనలో గురువారం ఒకరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన రొడ్డ అగ్గరయ్య, ఆరేళ్ల మహేష్ ఇద్దరు కలిసి కూలీ పనులకు వెళ్తుంటారు. అదే క్రమంలో ఈనెల 12వ తేదీన వారిద్దరి మధ్య కూలి డబ్బులు పంచుకునే క్రమంలో గొడవ జరిగింది. వచ్చిన కూలి డబ్బులు రూ.వెయ్యి లో రూ.600 ఆరేళ్ల మహేష్ తీసుకొని మిగిలిన రూ.400 రొడ్డ అగ్గరయ్యకు ఇచ్చాడు. డబ్బులు సమానం పంచాలని కోరిన అగ్గరయ్యను బూతులు తిడుతూ కట్టెతో మహేష్ దాడి చేసి గాయపర్చడంతో రక్త గాయాలయ్యాయి. దాడి చేసి గాయపర్చిన ఆరేళ్ల మహేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి, డీఈఓ అబ్దుల్ ఘనీ

వనపర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో భాష, గణిత విషయాల్లో వెనుకబడిన 3, 4, 5 తరగతుల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. వాటిపై పట్టు సాధించేలా ఏఐ టూల్స్ ద్వారా బోధన చేసేందుకు ఏర్పాట్లు చేయాలని గురువారం విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా కలెక్టర్లతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలో ఎంపిక చేసిన 11 పాఠశాలల్లో విద్యార్థులకు కంప్యూటర్ ఆధారిత బోధన ప్రారంభించేందుకు ఎంఈఓలు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. ఈ విధానం ద్వారా విద్యార్థుల్లో కనీస అభ్యాసన సామర్థ్యాలు పెరిగి భాష, గణిత శాస్త్రంపై కొంతమేర పట్టు సాధించే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘనీ, మహానంది తదితరులు పాల్గొన్నారు.

ఫారం 6, 7, 8 పూర్తి చేయాలి

ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం పెండింగ్‌లో ఉన్న ఫారం 6, 7, 8 అప్లికేషన్లను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అధికారులను ఆదేశించారు. గురువారం తెలంగాణ ఎన్నికల సీఈఓ సుదర్శన్‌రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు ఆర్డీఓ సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. సీఈఓ మాట్లాడుతూ మార్చి 19 లోపు ఈఆర్వో స్థాయిలో, మార్చి 22 లోపు జిల్లా ఎన్నికల అధికారి స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫారం 6, 7, 8 అప్లికేషన్లను మార్చి 21లోపు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించే సమావేశంలో వారి నుంచి వచ్చే అభ్యంతరాలను స్వీకరించి పరిష్కారం చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ కిషన్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

465 మందికి మధుమేహ పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎం సుమిత్ర

పాన్‌గల్: షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న మధుమేహ పరీక్షలు మండలంలో కొనసాగుతున్నట్లు పీహెచ్‌పీ డాక్టర్ చంద్రశేఖర్, సీహెచ్‌ఓ రామయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలో కొనసాగుతున్న పరీక్షలపై వారు ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 30 ఏళ్లు దాటినవారందరూ షుగర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. షుగర్ వ్యాధి నిర్ధారణ అయితే ఆహారపు అలవాట్లు మార్చుకొని వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని సూచించారు. మండలంలోని 10 సబ్‌సెంటర్ల పరిధిలో సిబ్బంది 465 మందికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మండలంలోని ఆకునోనిపల్లె, ఆకునోనిపల్లెతండాలో నిర్వహించిన మధుమేహ పరీక్షలో ఏఎన్‌ఎం సుమిత్ర పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వీపగండ్ల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకం కోసం చిన్న, సన్న కారు రైతులు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తు అందజేయాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను మామిడి, బత్తాయి, నిమ్మ, మునుగ, కొబ్బరి, ఆయిల్‌ఫాం, డ్రాగన్ ఫ్రూట్ లాంటి పండ్ల తోటల పెంపకం కోసం 5 ఎకరాల లోపు ఉన్న రైతులు దరఖాస్తులు అందజేయాలన్నారు. జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు, రైతు పాస్ బుక్కు, బ్యాంకు ఖాతా బుక్కు, ఆర్ఓఆర్, పాస్ ఫొటో పంచాయతీ కార్యాలయంలో అందజేయాలని ఆయన కోరారు.

'తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు'



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పెబ్బేరు రూరల్: పట్టణంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర కన్వీనర్ హేమారెడ్డి గురువారం మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా హేమారెడ్డి మాట్లాడుతూ వనపర్తి రోడ్డు విస్తరణలో భాగంగా ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా అందరికి సమన్యాయం చేయాలని కోరారు. బాధితులకు స్థలాలను త్వరగా మంజూరు చేయాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని పట్టణంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. అన్ని వార్డులకు రోజూ చెత్త బండ్లు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు క్రాంతికుమార్, రామకృష్ణ, కంచి ఆంజనేయులు, బలరాం, మోతే రఘు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఆవిష్కరణలు



వనపర్తి: జిల్లా కేంద్రంలోని మాస్టర్‌మైండ్స్ హైస్కూల్‌లో గురువారం సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలు అందరినీ అబ్బురపరిచాయి. ముందుగా రిటైర్డ్ జీహెచ్‌ఎం వెంకట్రామారెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి సైన్స్‌ఫెయిర్‌ను ప్రారంభించగా.. విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభతో రూపొందించిన ప్రయోగాలను ప్రదర్శించారు. సందర్శకులతో పాటు తోటి విద్యార్థులకు ప్రయోగాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గౌతమ్‌కుమార్, ప్రిన్సిపాల్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే లక్ష్యాలు నిర్దేశించుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: విద్యార్థులు పాఠశాల దశలోనే తమ జీవిత ఆశయాన్ని ఏర్పరచుకోవాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని హరిజన్‌వాడ జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నప్పటి నుండే విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నత స్థానానికి చేరుకున్న శాస్త్రవేత్తలు, విద్యావేత్తల యొక్క జీవిత విశేషాలను తెలుసుకొని ఆ స్థాయికి ఎదగడానికి పడిన శ్రమను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అంతేగాక విద్యార్థులు బాల్యం నుంచే సంస్కారాన్ని అలవరచుకోవాలని సూచించారు. తల్లిదండ్రులను, గురువులను, ఇరుగు పొరుగు వారిని గౌరవించాలన్నారు. ఎఫ్ఎల్‌ఎస్ టాలెంట్ టెస్ట్‌లో విజేతలుగా నిలిచిన సంగీత, శైలజ, వర్షితకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఈఓ అబ్దుల్‌ఘని, ఎంఈఓ మద్దిలేటి, హెచ్‌ఎంలు ఉమాదేవి, వరలక్ష్మి, ఉపాధ్యాయులు రవి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

అమరచింత: కార్మిక రంగాల అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించి, పట్టణంలోని బీడీ కార్మికులను మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కార్మికులకు రావాల్సిన పథకాలను వర్తించే విధంగా తనవంతు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దాసు, రాష్ట్ర కార్యదర్శి బోరింగ్ శ్రీనివాసులు, జమీల్, మాసన్న తదితరులు పాల్గొన్నారు.

'వందేళ్ల ప్రజా పోరాటాల చరిత్ర సీపీఐ సొంతం'



మాట్లాడుతున్న విజయరాములు

వనపర్తి రూరల్: దేశంలో వందేళ్ల ప్రజా పోరాటాల చరిత్ర గల ఏకైక పార్టీ సీపీఐ అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. మార్చి 23న జిల్లా కేంద్రంలో నిర్వహించే శత జయంతి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి, కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో సీపీఐ ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, గోపాలకృష్ణ, ఎత్తం మహేష్, విష్ణు, ఏఐఎస్ఎఫ్ నాయకులు నరేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్

అమరచింత: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉంటూ సమాజంతో పాటు సృష్టిలోని ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని నిత్యం ప్రార్థించడం అభినందనీయమని సీపీఐ అనుబంధ సంఘం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాబర్ట్ అన్నారు. పట్టణంలోని జామియా మసీదులో గురువారం ఉపవాస దీక్షాపరులకు ఇఫ్తార్‌లో భాగంగా పండ్లను అందించి మసీదులో ప్రార్థనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఖాసీం, ఖాజాహుస్సేన్, ఫరీద్ తదితరులు ఉన్నారు.

గ్రూప్–1లో సత్తాచాటిన యువకుడికి సన్మానం



కొత్తకోట రూరల్: ఇటీవల వెలువడిన గ్రూప్–1లో సత్తా చాటిన వడ్డెవాట గ్రామానికి చెందిన మండ్ల పవన్‌కుమార్‌ను గురువారం మదనాపురం, కొత్తకోట మండలాలకు చెందిన పలువురు వాల్మీకి బోయ నాయకులు అభినందిచారు. ఈ సందర్భంగా పవన్ కుమార్, తల్లిదండ్రులకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్ టీకే కుర్మన్న, భీమన్న నాయుడు, శాంతన్న, చంద్రాయుడు, తోకల వెంకటయ్య, రాములు, మండ్ల రవి, బాల్‌రాం, తలారి కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

వనపర్తిటౌన్: గ్రూప్– 1 ఫలితాల్లో 475.5 మార్కులు సాధించిన సుమశ్రీ ని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు గద్వాల కృష్ణ, పాలిటెక్నిక్ మాజీ ప్రిన్సిపాల్ రంగస్వామి సన్మానించారు. ఎంఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివిన్ కుమార్, దళిత నాయకులు కేశపాక కేశవులు, గంధం పరంజ్యోతి, గంధం భాస్కర్, బచ్చలకూర పరమేశ్వర్, గంధం భాస్కర్, గంధం రత్నయ్య, గంధం దాసు, గంధం ప్రసాద్, గోర్ల రాము, ద్యారపోగు గట్టయ్య, భీమయ్య పాల్గొన్నారు.

ఇళ్లకు దూరంగా విద్యుత్‌లైన్ ఏర్పాటు చేయాలి

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని ఇళ్ల పక్కల నుంచి ప్రమాదకరంగా కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేయొద్దని గోపాల్‌పేట గ్రామస్తులు కరెంటు పనులు అడ్డుకున్నారు. గురువారం పనులు చేస్తుండగా పనులను అడ్డుకుని విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి పిలిపించారు. గోపాల్‌పేట సబ్‌స్టేషన్ నుంచి పొలికెపాడు అడ్డ రోడ్డు వరకు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్ బస్టాండు ఏరియాలో ఇళ్లకు దగ్గరగా వెళ్తోందని. భవిష్యత్‌లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ఇళ్లకు దూరంగా లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగేలా ఉంటే మార్చాలని గ్రామ పెద్దలు లేఖ రాసి ఇస్తే గ్రామం బయటి నుండి లైన్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తామని హామీనిచ్చారు.

స్కూటీలో చెలరేగిన మంటలు



కొత్తకోట రూరల్: స్కూటీలో అకస్మాత్తుగా మంటలు చెలరేగిన ఘటన కొత్తకోట పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. మండలంలోని ముమ్మళ్లపల్లికి చెందిన సుధాకర్, శేషన్న స్కూటీపై ఉదయం గ్రామం నుంచి కొత్తకోటకు వచ్చి పని ముగించుకుని సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా.. పోలీస్‌స్టేషన్ సమీపంలోకి రాగానే స్కూటీ వేడెక్కడంతో గమనించిన ఇద్దరు స్కూటీని ఆపి చూడగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో పక్కనే ఉన్న ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. స్కూటీపై ప్రయాణిస్తున్న యువకులు అప్రమత్తంగా ఉండడంతో పెను ప్రమాదం తప్పింది.

అన్నదాన కార్యక్రమం

ఆత్మకూర్: దివంగత మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్ రెడ్డి జ్ఞాపకార్థం గురువారం స్థానిక సాయిబాబా మందిరం వద్ద మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జగదబీ రాంరెడ్డి, రామలక్ష్మారెడ్డి, బాలకృష్ణారెడ్డి, గాలిపంపు శ్రీను, ఎస్టీడీ శ్రీను, వెంకటేష్, తిరుపతయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే మార్నింగ్‌వాక్



మార్నింగ్ వాక్ చేస్తున్న యుగంధర్ గౌడ్

పెబ్బేరు రూరల్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకే మార్నింగ్ వాక్ చేస్తున్నామని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ అన్నారు. చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో పూజలు చేసి మార్నింగ్ వాక్ ప్రారంభించారు. సుభాష్ చౌరస్తాలో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి, పెబ్బేరు మార్కెట్ యార్డులో ఏడాది క్రితం కాలిపోయిన గోదాం, ఆర్టీసీ బస్టాండును సందర్శించారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ మార్కెట్ యార్డు గోదాం కాలిపోయిను ఘటనలో బాధ్యులపై కేసులు నమోదు చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పెబ్బేరు బస్టాండులో ప్రయాణికులకు తాగడానికి గుక్కెడు నీరు దొరకడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వీపీ గౌడ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వప్న, నరసింహ, జితేందర్, రాఘవేందర్‌గౌడ్, అంజన్నయాదవ్, మహేదర్‌నాయుడు, శివ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి ముందే గిడ్డంగికి చేరుతున్న బియ్యం



గిడ్డంగిలో బియ్యం సంచులను దించుతున్న హమాలీలు, బియ్యం సంచులతో లారీల క్యూ

అమరచింత: మండలంలోని ధర్మపురం శివారులో రూ.10 కోట్లతో నిర్మించిన గిడ్డంగి ప్రారంభోత్సవం చేయక ముందే ప్రభుత్వం వాటిలో రేషన్ బియ్యం సంచులను లారీలతో తరలిస్తున్నారు. పీడీఎస్ బియ్యాన్ని రేషన్ షాపులకు తరలించేందుకు వీటిలో స్టాకు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ డీఎం సోమయ్య తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పట్టణానికి చెందిన ప్రముఖ గాయకుడు, దివంగత గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ తన మండలానికి పదివేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గిడ్డంగిని మంజూరు చేశారు. నిర్మాణం పూర్తి చేయడంతో అధికారులు సదరు కాంట్రాక్టర్ ద్వారా గిడ్డంగిని స్వాధీనం చేసుకుని సివిల్ సప్లయి కి చెందిన బియ్యం బస్తాలను చేరవేస్తున్నారు. గిడ్డంగిని వనపర్తి జిల్లాలో నిర్మించినా.. నారాయణపేట జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు వినియోగించుకుంటున్నారు.

ఎకరాకు రూ.40 లక్షల పరిహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎండీ జబ్బార్

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని గణపసముద్రం రిజర్వాయర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి రూ.40 లక్షల పరిహారం ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జబ్బార్, భూ నిర్వాసితుల పోరాట కమిటీ కన్వీనర్ రాళ్ల కృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ గణపసముద్రం చెరువును రిజర్వాయర్‌గా మార్చడం వలన రైతులు ఎంతో విలువైన భూములను కోల్పోతున్నారన్నారు. ప్రస్తుత మార్కెట్ విలువను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఎకరాకు రూ.40 లక్షల పరిహారం ఇవ్వడంతో పాటుగా 2013 భూ సేకరణ చట్టం ప్రకారం అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ రిజర్వాయర్‌లో వెయ్యి మంది రైతులకు సంబంధించిన 625 ఎకరాల భూమిని ముంపునకు గురవుతుందని తెలిపారు. రైతులకు పరిహారం ఇవ్వకుండా రిజర్వాయర్ పనులు చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. దేవేందర్, సామ్యానాయక్, గొడుగు సత్యనారాయణ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ వర్కర్లు

వీపగండ్ల: పంచాయతీ వర్కర్లకు చెల్లించాల్సిన వేతనాలు సక్రమంగా చెల్లించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని, పెండింగ్ వేతనాలను సకాలంలో చెల్లించాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్ల ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. దాదాపు 5 నెలల నుంచి వేతనాలు చెల్లించలేదని, జీఓ నెంబర్ 60 ప్రకారం కార్మికులకు వేతనాలు ఇవ్వాలని పంచాయతీ వర్కర్లు అనే పదాన్ని తొలగించి పంచాయతీ అసిస్టెంట్లుగా నామకరణం చేయాలని కోరుతూ ఎంపీడీఓ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తికి విన్నవించారు. తమ డిమాండ్లను నెరవేర్చకుంటే ఈ నెల 18న కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు గోవిందు, సిద్ధు, రాజబాబు, చారి, లక్ష్మయ్య, గంగమ్మ, బాలనాగమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

వనపర్తి టౌన్: మాదిగలకు రిజర్వేషన్ కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు జిల్లా కేంద్రంలోని మర్రికుంటలో చేపడుతున్న రిలే దీక్షలు వనపర్తి మండల అధ్యక్షుడు తిరుపతి ఆధ్వర్యంలో 4వ రోజు పూర్తి చేసుకుంది. ఈ మేరకు గురువారం దీక్షలో జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు మాట్లాడుతూ.. మాదిగలకు రిజర్వేషన్ వాటా జనాభా దామాషా ప్రకారం కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు గంధం గట్టయ్య, వెంకటస్వామి, వెంకటేష్, పవన్ కళ్యాణ్, వేణు, శివకుమార్, పరుశురాములు, బాబురావు, వంశీ, శివాజీ, శరత్, నాగన్న పాల్గొన్నారు.

ఆత్మకూర్: ఎస్సీ వర్గీకరణ పూర్తయిన తర్వాతే గ్రూప్ 1, 2 నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అజ్జపాగ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం గాంధీచౌక్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్ష రెండోరోజు కొనసాగింది. కార్యక్రమంలో దండు శ్రీను, సోంబాబు, జాంగీర్, జానకీరాములు, కట్టెల మిషన్ రాజు, మాసన్న, కురుమూర్తి, కిశోర్ పాల్గొన్నారు.

ఎండిన పంటల పరిశీలన

వనపర్తి రూరల్: మండలంలోని పెద్దగూడెంతండాలో రైతులు బోర్ల కింద 80 ఎకరాలు వరి సాగు చేశారు. భూగర్భ జలాలు తగ్గి వ్యవసాయ బోర్లలో నీటి నిల్వలు పడిపోవడంతో వరి పంటలు ఎండిపోతున్నాయని రైతుల వినతి మేరకు గురువారం ఏఓ కురుమయ్య, ఏఈఓ, రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం 6 నుంచి 7 ఎకరాల దాక పంట ఎండిపోయిందని, రానున్న వారం రోజుల్లో నీరు అందక పంట మరింత నష్టం అయ్యే అవకాశం ఉందని ఆయన అన్నారు. త్వరలో పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని రైతులకు వివరించారు.

కోటి తలంబ్రాల దీక్ష

అమరచింత: కోటి తలంబ్రాల దీక్షలో భాగంగా 'వడ్లు ఒలుపు రాముడి పిలుపు' అనే శ్రీరామ నామ జపంతో భద్రాది రామయ్య అనుగ్రహంతో కోటి తలంబ్రాల కార్యక్రమంలో పట్టణానికి చెందిన రాంనగర్ మహిళలు పాల్గొన్నారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని భద్రాది రామయ్య కల్యాణంలో వినియోగించే తలంబ్రాలకు సంబంధించి స్వయంగా వడ్లు ఒలిచి వాటిలోంచి బియ్యపు గింజలను తీసి రామయ్య మందిరానికి పంపడం కోసం రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు భద్రాచలం నుంచి పాకెట్ల రూపంలో వడ్లు పంపించినట్లు బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు తెలిపారు. కార్యక్రమంలో మేర్వ సుమశ్రీ, సుధ, లావణ్య, కంకరి మణెమ్మ ఉన్నారు.

అంగన్‌వాడీలో హోలీ వేడుకలు

అమరచింత: పట్టణంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిన్నారులతో కలిసి అంగన్‌వాడీ టీచర్ హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులపై రంగులను చల్లి పండుగ ప్రాముఖ్యతను వివరించినట్లు టీచర్ రాధిక తెలిపారు. సహజంగా దొరిగే రంగులను మాత్రమే వినియోగించాలని, కెమికల్ కలిపిన రంగులను వినియోగించడం ద్వారా కలిగే నష్టాలను వివరించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన్న చేసి తల్లులకు పోషకాహారం గురించి అవగాహన కల్పించారు.

ఆశాలకు కనీస వేతనం ఇవ్వాలి

వనపర్తి రూరల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఆశావర్కర్లకు రూ.18 వేల కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ ఆశావర్కర్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ఉపాధ్యక్షురాలు గిరిజ అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆశావర్కర్లతో వెట్టి చాకిరి చేయించుకోవడం సరికాదన్నా రు. కార్యక్రమంలో సునీత, మంజుల, రాగమ్మ, జ్యోతి, రాధ, చెన్నమ్మ, సుమతి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు మతిస్థిమితంలేని మహిళ

ఖిల్లాఘనపురం: మతిస్థిమితం కోల్పోయి రోడ్ల వెంట తిరుగుతున్న ఓ మహిళను పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలు.. ముసాపేట మండలం నందిపేట గ్రామానికి చెందిన చంద్రకళ మతిస్థిమితం కోల్పోయి ఖిల్లాఘనపురం గ్రామ పంచాయతీ సమీపంలో సంచరిస్తుంది. ఇది చూసిన కొందరు గ్రామస్తులు 100 కు డయల్ చేసి సమాచారాన్ని పోలీసులకు ఇచ్చారు. విషయం తెలుసుకున్న హెడ్‌కానిస్టేబుల్ బొట్టు శ్రీను, కానిస్టేబుల్ రాజు, హెచ్‌జి నాగిరెడ్డి గ్రామ పంచాయతీ వద్ద ఆమెను గుర్తించి స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించడంతో పాటు ఆమె వివరాలు తెలుసుకున్నారు. నందిపేట గ్రామానికి ఫోన్‌చేసి కుటుంబ సభ్యులకు విషయం చెప్పారు. చంద్రకళ తల్లి కొయ్య వెంకటమ్మ, మేనమామ రాత్రికి ఖిల్లాఘనపురం వచ్చిన తర్వాత ఆమెను అప్పగించారు.